# కాంగ్రెస్‌వి భరోసా లేని పథకాలు

- ఆ పార్టీకి ఓటేస్తే రాష్ట్రంలో చీకటే
- బీఆర్ఎస్‌లో అద్భుతంగా అభివృద్ధి
- రాష్ట్ర అభివృద్ధికి పట్టం గట్టండి
- ఆశీర్వదించండి.. మరింత సేవ చేస్తా
- మానకొండూరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్
- ప్రచారంలో అడగడుగునా నీరాజనం


రామహనుమాన్ నగర్ లో వృద్ధుడిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న రసమయి

తిమ్మాపూర్ రూరల్, అక్టోబర్ 30: కాంగ్రెస్ పార్టీవి భరోసా లేని పథకాలని, వారి పాలనలో గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని మానకొండూరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్ విమర్శించారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ రాష్ట్రం అంధకారంలోకి పోతుందని వాపోయారు. నియోజకవర్గాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశానని మరోసారి తనను ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం సాయంత్రం మండలంలోని జూగుండ్ల, రాం హనుమాన్‌నగర్, వచ్చునూరు, నేదునూరు, లక్ష్మీదేవిపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో గ్రామాల రూపు రేఖలు ఎంతగానో మారాయని తెలిపారు. కాంగ్రెస్ రైతులపై విషం కక్కుతుందని, అందుకే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి రైతుబంధును ఆపాలని చూశారని తెలిపారు. మూడు గంటలు కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ కావాలో, 24 గంటల కరెంట్ ఇస్తున్న బీఆర్ఎస్ కావాలో రైతులు ఆలోచించాలన్నారు. రైతన్నలకు భరోసా కల్పించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్లీ అధికారంలోకి రాగానే రూ.16 వేల రైతుబంధు అందజేస్తామన్నారు. అధికారంలోకి రాగానే రైతుబంధు తరహాలో తెల్ల రేషన్ కార్డ్ ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసి సామాన్య ప్రజానికానికి అండగా నిలిచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికలు రాగానే అధికారం కోసం పగటి వేషాలు వేస్తూ..దొంగ హామీలను ఇచ్చే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాయ చేసే నాయకులు వస్తున్నారని, మాటలు నమ్మి ప్రజలు ఆగం కావద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పని చేసిందని, ఎన్నికల్లో ప్రజలు రాష్ట్ర అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. తాను ఎంతో అభివృద్ధి చేశానని, ఇంకా చేస్తానని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఇనుకొండ జితేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ లాగుల వీరారెడ్డి, సర్పంచులు ఎల్లేశ్, యాదగిరి వెంకటేశ్వరరావు, ఉప్పులేటి ఉమారాణి, వడ్లూరి శంకర్, పద్మజ, మల్లెత్తుల అంజయ్య, ఎంపీటీసీ కనకం కొమురయ్య, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జుగుండ్లలో రసమయి బాలకిషన్‌కు కోలాటలాడుతూ స్వాగతం పలుకుతున్న మహిళలు

## తండ్రి కోసం తనయుడి ప్రచారం



కరీంనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్ గెలుపు కోసం తనయుడు హరిహరణ్ సోమవారం కరీంనగర్ మండలంలోని ఇరుకుల్లలో ఇంటింటా ప్రచారం చేశారు. స్థానిక హనుమన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కారుగుర్తుకు ఓటు వేయాలని, గంగుల కమలాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యువకులు, వృద్ధులను కోరారు. కుర్మ సంఘ నాయకులు హరిహరన్‌కు గొంగళిని కప్పి గొర్రె పిల్లను బహూకరించారు. తమ ఓటు గంగుల కమలాకర్‌కే అంటూ గ్రామస్తులు హరిహరన్‌కు అభయం ఇచ్చారు.

– కరీంనగర్ రూరల్, అక్టోబర్ 30

# తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టొద్దు

- విపక్షాలకు అధికారమిస్తే 50 ఏండ్లు వెనక్కి వెళ్తాం
- మహిళల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా
- ఆడబిడ్డల ఆశీర్వాదమే కొండంత బలం
- మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, అక్టోబర్ 30 : ఉద్యమం చేసి సాధించుకున్న రాష్ట్రాన్ని దొంగల పాలు చేయొద్దని, విపక్షాలకు అధికారం ఇస్తే అభివృద్ధి ఆగిపోతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. స్థానిక సీతారాంపూర్‌లో 20, 21 డివిజన్ల మహిళల ఆత్మీయ సమ్మేళనానికి హాజరవగా, ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కరీంనగర్ నుంచి మూడుసార్లు ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే గెలిచానని, మహిళల ఆశీర్వాదమే తమకు ఎంతో బలమని పేర్కొన్నారు. తమపై పెట్టుకున్న ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. 50 ఏళ్లుగా ఎన్నో ప్రభుత్వాలు వచ్చినా కరీంనగర్ అభివృద్ధిలో ఏం మార్పులూ రాలేదని, 50 ఏళ్ల దరిద్రాన్ని, పదేళ్లల్లో జరిగిన అభివృద్ధిని గమనించాలని కోరారు. మహిళల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆచరణ కాని హామీలను ఇస్తున్నదని, ఆచితూచి ఓటు వేయాలని సూచించారు. ఒక్క ఓటు తప్పు చేస్తే 50 ఏళ్లు వెనక్కి పోతామన్నారు. తెచ్చుకున్న తెలంగాణను కాపాడుకోవాలంటే కేసీఆర్ చేతుల్లోనే ఉంచాలన్నారు. తెలంగాణను ఢిల్లీ చేతుల్లో పెడితే అరిగోస పడుతామన్నారు. మన బిడ్డల భవిష్యత్తు కోసం కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, మెడికల్ కళాశాలను తెచ్చుకున్నామని తెలిపారు. విపక్షాలను నమ్మి ఓట్లు వేస్తే ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మళ్లీ గెలిపిస్తే కాలనీల్లోని సమస్యలను తీర్చే బాధ్యతను తీసుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే ఎంపీ ఇప్పటి వరకు ప్రజల వద్దకు రాలేదన్నారు. అలాంటి వారికి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. అభివృద్ధి సాగిస్తున్న వారిని మరోసారి ఆశీర్వదించాలని, మహిళల అండదండలు అందించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్ జంగిలి సాగర్, భూమాగౌడ్, నాయకులు తుల బాలయ్య, శ్రీనివాస్ , మహిళలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, హాజరైన మహిళలు

## ఇండియా బుక్ ఆఫ్ ది రికార్డుకు దాసరి ఆర్యాహి

కరీంనగర్ రూరల్, అక్టోబర్ 30: తీగలగుట్టపల్లికి చెందిన పాకల రాంరెడ్డి మనుమరాలు, దాసరి ఉదయ్ రెడ్డి– శ్రీలేఖ కూతురు 18 నెలల ఆర్యాహి ఇండియా బుక్ ఆఫ్ ది రికార్డు కు ఎంపికైంది. ఛత్తీస్‌ఘడ్‌లో సెప్టెంబర్ 29న ఇండియా బుక్ ఆఫ్ధి రికార్డు వారు నిర్వహించిన కాంటెస్ట్‌లో ఇంగ్లిష్ ర్యామ్స్, అల్ఫాబెట్స్, 15 వరకు కౌంటింగ్, 12 రకాల జంతువులు, 5 రకాల పక్షులు, 19 శరీర భాగాలు, 12 రకాల పండ్లు, 8రకాల కూరగాయల పేర్లను తెలిపి విజేతగా నిలించింది. సోమవారం పోస్టుద్వారా తీగలగుట్టపల్లి లోని వారి ఇంటికి అవార్డును పంపించారు. ఈసందర్భంగా రెండో డివిజన్ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య, రైతు బంధు సమితి మండల కన్వీనర్ కాశెట్టి శ్రీనివాస్, ఆర్యాహి తాత, తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



అవార్డులతో దాసరి ఆర్యాహి

# బీసీల ద్రోహి బీజేపీ

- బండి ఎంపీగా ఏం చేశావో చెప్పు?
- ఆ తర్వాతే ఓట్లడుగు?
- బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నది సీఎం కేసీఆరే
- బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు హరిశంకర్ ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, అక్టోబర్ 30 : బీసీ ద్రోహి బీజేపీ అని, మతాలు, కులాల పేరిట ప్రజల మధ్య చిచ్చు పెట్టి బీజేపీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నదని బీఆర్ఎస్ కరీంనగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్ ధ్వజమెత్తారు. బీసీ ప్రధాన మంత్రిగా ఉండి కూడా కేంద్రంలో మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదని, బీసీ గణన చేపట్టలేదని విమర్శించారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఈ నాలుగున్నరేళ్లు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏం చేశారో..? కేంద్రం నుంచి ఎన్ని నిధులు తీసుకువచ్చారో..? చెప్పాలని, ఆ తర్వాతే ప్రజలను ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ 37వ డివిజన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులాల నుంచి ఒకరిని సీఎం చేస్తామని బీజేపీ ప్రకటించడమే విడ్డూరంగా ఉందన్నారు. తొమ్మిదేళ్ల కిందటే బీసీ గణన చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానం చేసి పంపిస్తే ఇప్పటి వరకు దానిపై పట్టించుకోలేదని మండిపడ్డారు. మొదట వీటిని చేపట్టి తర్వాత బీసీ సీఎం గురించి మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేత బండి సంజయ్‌ను ఎందుకు ఆ పదవి నుంచి తొలగించారో అధిష్టానాన్ని ప్రశ్నించాలని బండికి సూచించారు. బీజేపీ తమ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించి వారమైన సంజయ్ కనిపించలేదని, వారం తర్వాత వచ్చి అధిష్టానానికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు చెప్తుంటేనే వారి పరిస్థితి ఏంటో అర్థమవుతుందని, ఓటమి భయం పట్టుకొనే ఇప్పటి వరకు బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. ఎంపీగా గెలిపిస్తే ఏం చేయలేని బండి సంజయ్‌కి ఇప్పుడు ప్రజలను ఓట్లడిగే అర్హత లేదన్నారు. బీసీ అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్ అని పేర్కొన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించేందుకు బీసీ బంధుతో ఆర్థిక సహాయం అందించిన గొప్ప నాయకుడన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీ కులాల భవనాలకు స్థలాలు ఇవ్వడంతోపాటు నిధులను కూడా ఇచ్చి ఆత్మగౌరవం నిలబెట్టిన నేత అని కొనియాడారు. సీఎం స్థాయి వ్యక్తిని ఏకవచనంతో మాట్లాడితే ప్రజలెవరూ సహించరని హెచ్చరించారు. నాలుగున్నరేళ్లుగా సంజయ్‌ని ప్రజలు మరిచిపోయారని, ఆయన అనుచరుల వద్ద ఎమ్మెల్యేగా పోటీ చేయడం ఇష్టం లేదని చెప్తున్నారని తెలిపారు. ఇలాంటి వ్యక్తులు ఇప్పుడు బీసీ సీఎం పేరుతో ప్రజల్లో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బీజేపీ, బండి సంజయ్ ఎన్ని గారడీ మాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గడ్డం ప్రశాంత్‌రెడ్డి, ఆరె రవిగౌడ్, షౌకత్, నవాజ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.